ENADU

24 APR 2021

## లాక్‌డౌన్ నుంచి వ్యాపారాలకు మినహాయింపు

**యానాం:** కరోనా వైరస్ విస్తృతిని అడ్డుకునేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశాలతో యానాంలో శుక్రవారం నుంచి సోమవారం ఉదయం అయిదు గంటల వరకు అమలవుతున్న లాక్‌డౌన్ నుంచి పలు వ్యాపారాలకు మినహాయింపు ఉన్నట్లు పరిపాలనాధికారి అమన్‌శర్మ తెలిపారు. భోజన శాలలు, కిరణా, పండ్లు, కూరగాయల దుకాణాలు, పాలకేంద్రాలు, మాంసం, చేపల విక్రయాలు, పశు దాణా, కళ్లజోళ్ల దుకాణాలు యధావిధిగా పని చేస్తాయని, ఔషధాలు, వైద్యపరికరాలు, ఆసుపత్రులు, పెట్రోలు బంకులు 24 గంటలు పని చేస్తాయన్నారు. టెలీ కమ్యూనికేషన్, ఏటీఎం, మంచినీరు, విద్యుత్ సరఫరా, పరిశ్రమల ఉత్పత్తులపై ఎలాంటి ఆంక్షలు లేవన్నారు.

### *15 రౌండ్లలో ఓట్ల లెక్కింపునకు నిర్ణయం*

కొవిడ్ ఆంక్షలు, ఎన్నికల్లో పోటీపడిన అభ్యర్థుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని యానాం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును 15 రౌండ్లలో నిర్వహించాలని నిర్ణయించినట్లు రిటర్నింగ్ అధికారి అమన్‌శర్మ తెలిపారు. పౌరకార్యాలయంలోని సమావేశ మందిరంలో వచ్చేనెల 2న ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందన్నారు.

SAKSHI

24 APR 2021

## రిలీఫ్ మెటీరియల్ ఇవ్వొచ్చు

**యానాం:** కరోనా రోగులకు అందించేందుకు రిలీఫ్ మెటీరియల్ (మాస్కులు, శానిటైజర్లు, చేతిగ్లౌజ్‌లు, ఫేస్ షీల్డులు, పీపీఈ కిట్లు, ఆక్సిజన్ సిలిండర్లు) దాతలు విరాళంగా ఇవ్వొచ్చని ఆర్ఏఓ అమన్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి తమ కార్యాలయంలో షబాజ్‌ను 9032093583 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## యానాంలో భారీ వర్షం

**యానాం:** నియోజకవర్గ పరిధిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

## కర్ఫ్యూ నిబంధనలు పాటించాలి

**యానాం:** నియోజకవర్గంలో అమలు చేస్తున్న కర్ఫ్యూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆర్ఏఓ అమన్‌శర్మ కోరారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు విధిస్తున్న కర్ఫ్యూ శుక్రవారం రాత్రి నుంచి 26న ఉదయం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

ANDHRA PRABHA

24 APR 2021

## యానాంలో వారాంతపు లాక్‌డౌన్

తమిళసై నేతృత్వంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయంతీసుకున్నారు. ఇది పుదుచ్చేరి,మహే,కరైకల్ యానాంలలో వర్తిస్తుంది. యానంలో మద్యం దుకాణాలు,బార్ అండ్ రెస్టారెంట్లు అన్ని ప్రతిరోజు మధ్యాహ్నం రెండుగంటల వరకే తెరిచి ఉంచాలి. అలాగే వివాహ, ఇతర శుభకార్యాలకు 100మంది, అంత్యక్రియలకు 50మంది లోపు మాత్రమే పాల్గోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.రాజకీయ,మతపరమైన సమావేశాలన్నింటికి ముందస్తు అనుమతులు తప్పనిసరి చేసింది. అత్యవసర సేవల్లో పాల్గొవే సిబ్బంది, వాహనాలు, గుర్తింపు కార్డుల్ని కలిగుంటాలని ఆదేశించింది.

JANASPANDANA

24 APR 2021

# కరోనా నుండి కోలుకున్న ఇండిపెండెంట్ అభ్యర్ది గొల్లపల్లి

యానం, ఏప్రిల్ 23 (జనస్పందన విలేకరి) స్థానిక యానం కేంద్రపాలిత ప్రాంతం యానం నియోజకవర్గంలో ఏప్రిల్ 6న జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వతంత్ర అభ్యర్దిగా పోటీచేసిన గొల్లపల్లి అశోక్ కరోనా పాజిటీవ్ నిర్ధారణ అయింది. అనంతరం పాజిటీవ్ వచ్చిన తరువాత ఆయన డాక్టర్ల సలహా మేరకు క్వారంటైన్‌లో ఉంటూ మళ్లీ నెగిటివ్ వచ్చిన తరువాత పూర్తిగా కోలుకుని తిరిగి ఆయన ప్రజల ముందుకు వచ్చారు. ఇది ఇలా ఉండగా శుక్రవారంనాడు యానంలో పలు దేవాలయాలు ఆయన దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు ముస్లిం ప్రార్ధనా మందిరాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ANDHRA JYOTHI

24 APR 2021



## రెండు రోజులు పూర్తి లాక్‌డౌన్

యానాం, ఏప్రిల్ 23: గవర్నర్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ నిర్ణయం మేరకు యానాం నియోజక వర్గంలో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి సోమవారం ఉదయం 5గంటల వరకు పూర్తి లాక్‌డౌన్ విధించినట్లు అధికారులు తెలిపారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఇచ్చారు. యానాం నియోజకవర్గంలోని ముఖ ద్వారాల వద్ద పోలీసులు గేట్లను ఏర్పాటు చేశారు. కొవిడ్‌కు సంబంధించిన మెటీరియల్, బాధితులకు విరాళాలు ఇవ్వదలిస్తే నోడల్ అధికారి షబాజ్ (9032093583)ను సంప్రదించాలన్నారు.

### యానాంలో 50 కేసులు

యానాంలో శుక్రవారం 50పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో యానాంలో పాజిటివ్ కేసుల సంఖ్య 2,666కు చేరాయి. ప్రస్తుతం 371కేసులు యాక్టివ్‌లో ఉన్నాయి. ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించవద్దని అధికారులు సూచించారు.

## 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

యానాం, ఏప్రిల్ 23:యానాంలో పెరుగుతున్న కరోనా కేసుల ప్రభావం మే 2న జరిగే ఓట్ల లెక్కింపుపై పడింది. గతంలో 33 పోలింగ్ బూత్‌లు ఉన్నప్పుడు ఐదు రౌండ్లలో ఓట్లు లెక్కింపు జరిగేది. కొవిడ్ నేపథ్యంలో 60 పోలింగ్ బూత్‌ల్లో ప్రజలు ఓట్లు వేశారు. ఇప్పుడు 15రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు. ఒక రౌండ్‌కు నాలుగు టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు యానాం ఎన్నికల అధికారి అమన్‌శర్మ తెలిపారు.